ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 114 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం 3 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## ప్రపంచ స్థాయికి
# తెలంగాణను తీసుకెళ్తున్నాం
## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ఆగస్టు 2 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలోని తమ ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తోందని, రాష్ట్ర రూపురేఖలను మారుస్తూ ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సమావేశం అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం, బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్లో జరిగింది.

ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలను విదేశీ ప్రతినిధులు, ఎన్ఆర్ఐలకు భట్టి విక్రమార్క ..మిగతా 2లో



## వైభవోపేతంగా ఉజ్జయిని మహంకాళి
# బోనాలు

**అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి**

**సికింద్రాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన లష్కర్ బోనాలు**

**ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి భక్తుల ప్రత్యేక పూజలు - మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 2 (ప్రభాత ఉదయం)**

సికింద్రాబాద్‌లో లష్కర్ బోనాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన సీఎంకు నిర్వాహకులు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. సీఎంతో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్‌లు ఉన్నారు. కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు.

అమ్మవారికి బంగారు బోనం సమర్పించిన పొన్నం : అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, బంగారు బోనం సమర్పించారు. అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సమృద్ధిగా వర్షాలు పడాలని వేడుకున్నట్లు ..మిగతా 2లో

# క్షమించరాని తప్పు చేశాను

**బాలిక ఆవేదన.. "నా వయసు కేవలం 15 ఏళ్లే.. నన్ను క్షమించండి": ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాలిక క్షమాపణ**





**న్యూఢిల్లీ, ఆగస్టు 2 (ప్రభాత ఉదయం)**

జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన విద్యార్థుల నిరసన ప్రదర్శనలో ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర అభ్యంతరకర పదజాలం ఉపయోగించిన కేసులో నిందితురాలిగా ఉన్న బాలిక సోషల్ మీడియా వేదికగా బహిరంగ క్షమాపణలు చెప్పింది. చేతులు జోడించి నమస్కరిస్తూ.. మాట్లాడిన ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట తీవ్రంగా వైరల్ అవుతోంది. ఇతరుల ..మిగతా 2లో

# మేం ఏడిస్తే రాష్ట్రానికే మంచిది కాదు..



**ప్రభుత్వంపై జోగిని శ్యామల ఫైర్**

**సికింద్రాబాద్ మహంకాళి బోనాల ఏర్పాట్లపై ప్రముఖ జోగిని శ్యామల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.**

**మేం ఏడిస్తే రాష్ట్రానికే మంచిది కాదు.. ప్రభుత్వంపై జోగిని శ్యామల ఫైర్**

**హైదరాబాద్, ఆగస్టు 2 (ప్రభాత ఉదయం)**

మేం కన్నెర్రజేసి ఏడిస్తే తెలంగాణ రాష్ట్రానికే అరిష్టమని, మంచిది కాదని జోగిని శ్యామల సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాలకు హాజరైన ఆమె ప్రభుత్వ ఏర్పాట్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వస్తాయి.. పోతాయి, తమలో ఊపిరి ఉన్నంత వరకు ఇదే వృత్తిలో ఉండి అమ్మవారి సేవకు అంకితం అవుతామని అన్నారు. గత ప్రభుత్వంలో కొంతైనా సాధారణ భక్తులకు, జోగినిలకు ప్రయారిటీ ఇచ్చారని, ప్రస్తుత ప్రభుత్వం తమ పట్ల అతి దారుణంగా వ్యవహరిస్తోందని జోగిని శ్యామల కామెంట్ చేశారు. వేలాదిగా ఉన్న శివశక్తుల్లో కేవలం తమకు 5 పాస్‌లు ఇస్తామని చెప్పారని అన్నారు. ఆ ఐదుగురిలో బాగా ఫేమస్ అయిన వాళ్లకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని వేడుకున్నామని, పోలీసులు మాత్రం తమ రిక్వెస్ట్‌ను పట్టించుకోలేదని ఆరోపించారు. అమ్మవారిని దర్శించుకునే ..మిగతా 2లో

## అలా హామీ ఇస్తేనే
# వచ్చే ఎన్నికల్లో పోటీ

**లేకుంటే తప్పుకుంటా.. మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, ఆగస్టు 2 (ప్రభాత ఉదయం)**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ప్రజలు మాట ఇస్తేనే తాను బరిలో ఉంటానని, లేదంటే తప్పుకుంటానని మంత్రి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. నామినేషన్ వేసిన తర్వాత ప్రచారానికి రాకపోయినా.. నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో తన ఆస్తుల గురించి కూడా మంత్రి మాట్లాడారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీపై తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ..మిగతా 2లో



# పాకిస్థాన్‌లో విషాదం

**శాంతి ర్యాలీలో ఆత్మాహుతి దాడి.. 14మంది మృతి..**

**న్యూఢిల్లీ, ఆగస్టు 2 (ప్రభాత ఉదయం)**

పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఆదివారం జరిగిన శాంతి ర్యాలీపై ఆత్మాహుతి బాంబు దాడి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. స్వాత్ జిల్లాలోని కబల్ పట్టణంలో నిర్వహించిన ఉగ్రవాద వ్యతిరేక శాంతి ర్యాలీని లక్ష్యంగా చేసుకుని దాడి జరగ్గా.. 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పలువురు పోలీసులు, సాధారణ పౌరులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. 20 మందికిపైగా గాయపడ్డారు.

స్థానికుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో వందలాది మంది పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో మిలిటెంట్ కార్యకలాపాలను అరికట్టాలని, శాంతి భద్రతలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సమీపంలోకి వచ్చిన ఓ ఆత్మాహుతి దాడిదారు తన వద్ద ఉన్న పేలుడు పదార్థాలను పేల్చుకోవడంతో భారీ పేలుడు సంభవించింది.

పేలుడు అనంతరం పోలీసులు, సహాయక బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ..మిగతా 2లో



# ముదిరిన కావేరి జల వివాదం

**ఆగస్టు 13న బంద్! ప్రజలకు కర్ణాటక ప్రభుత్వం కీలక విజ్ఞప్తి**

**కావేరి నదీ జలాల పంపకాలపై కర్ణాటక-తమిళనాడు మధ్య మరోసారి వివాదం తీవ్రరూపం దాల్చింది.**

**ముదిరిన కావేరి జల వివాదం: ఆగస్టు 13న బంద్! ప్రజలకు కర్ణాటక ప్రభుత్వం కీలక విజ్ఞప్తి**

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# వైభవోపేతంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు



మొదటి పేజీ తరువాయి...

వివరించారు. భక్తులకు మహంకాళి అమ్మవారు దేదీప్యమానంగా దర్శనం ఇస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు : తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించేందుకు ఉజ్జయిని మహంకాళి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆరు క్యూలైన్లను ఏర్పాటు చేసి అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నారు. బోనంతో వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో 2,500 మంది పోలీసులతో భద్రతను ఏర్పాటు చేశారు. 500 మంది ప్రత్యేక వాలంటీర్లు సేవలందిస్తున్నారు. బోనాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సజ్జనర్ : సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయన, అమ్మవారికి పట్టు వస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా నగర సీపీ సజ్జనర్ మీడియాతో మాట్లాడుతూ భాగ్యనగరంలో ఆషాఢ బోనాల పండుగకు ఘనమైన చారిత్రక నేపథ్యం ఉందన్నారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా ఉత్సవాలు అత్యంత ప్రశాంత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో సాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే గోల్కొండ, బల్కంపేట బోనాల జాతరలు ప్రశాంతంగా ముగియగా, ప్రస్తుతం ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజా అమ్మవార్ల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని వివరించారు. భక్తుల భద్రత, రక్షణే ధ్యేయంగా హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖ పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు.

తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్ : ఉజ్జయిని మహంకాళి బోనాల వేడుకలకు దాదాపు 2,500 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీపీ సజ్జనర్ తెలిపారు. ఉత్సవాల్లో ఏటా పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్, నిఘా వ్యవస్థను మహంకాళి ఆలయం వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అత్యాధునిక ఏఐ వ్యవస్థ ద్వారా ఆలయ పరిసరాల్లోని సీసీటీవీ కెమెరాలతో ముఖాలను విశ్లేషించే 'ఫేషియల్ రికగ్నిషన్' సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు. దీనివల్ల పాత నేరస్థులు, గొలుసు దొంగలు, జేబుదొంగలను తక్షణమే గుర్తించి అప్రమత్తమయ్యే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు.

తొక్కిసలాటలు జరగకుండా చర్యలు : అలాగే ఆలయంలోకి వచ్చే, వెళ్లే భక్తుల సంఖ్యను క్యూ మేనేజ్‌మెంట్ ద్వారా కచ్చితంగా లెక్కిస్తామని సీపీ సజ్జనర్ పేర్కొన్నారు. ఆలయం లోపల వివిధ విభాగాలు, క్యూ లైన్లలో భక్తుల రద్దీ సాంద్రతను 'థ్రెషోల్డ్ మ్యాపింగ్' ద్వారా నిరంతరం విశ్లేషిస్తూ, పరిమితికి మించి రద్దీ పెరిగితే ముందస్తు చర్యల ద్వారా తొక్కిసలాటలు జరగకుండా నివారిస్తామని స్పష్టం చేశారు. బోనాల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, తదితర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటున్నామని వివరించారు. భక్తులందరూ ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవాలని, జాతర విజయవంతంగా పూర్తయ్యేలా పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు



### ఉత్సవాల నిర్వహణకు

# బిచ్చమెత్తుకోవాలా?

## రాష్ట్ర ప్రభుత్వంపై బండి సంజయ్ ఫైర్

హైదరాబాద్, ఆగస్టు 2 (ప్రభాత ఉదయం)

రాష్ట్రంలో హిందూ పండుగలు, ఉత్సవాల నిర్వహణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, హిందూ పండుగల పట్ల పక్షపాతం చూపిస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. హిందూ ఉత్సవాల నిర్వహణకు కావాల్సిన నిధుల కోసం హిందువులు బిచ్చమెత్తుకునే దుస్థితి రాష్ట్రంలో నెలకొందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ ఆయన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "రంజాన్ పండుగ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.33 కోట్లు కేటాయించింది. అయితే, 80 శాతానికి పైగా ఉన్న హిందువులు నిర్వహించుకునే బోనాల ఉత్సవాలకు మాత్రం కేవలం రూ. 20 కోట్లు కేటాయించడాన్ని చూస్తుంటే హిందువుల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్ధమవుతోంది. జంట నగరాల్లోని 3 వేలకు పైగా దేవాలయాల్లో బోనాలు ఘనంగా జరుగుతుంటే, ప్రభుత్వం ఇచ్చిన అరకొర నిధులు ఏ మూలకు సరిపోతాయి. బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి నిధులు మాత్రం కేటాయించడం లేదు." అని బండి సంజయ్ మండిపడ్డారు.

**హిందువుల పండుగలపై ఎందుకీ నిర్లక్ష్యం..**

ఆలయ ప్రాంగణంలో తీవ్రమైన ఎండలో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే భక్తులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించకపోవడం శోచనీయమని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం, మంత్రులు వచ్చి కేవలం దర్శనం చేసుకుని వెళ్లిపోతే సరిపోదని, భక్తుల ఇబ్బందులను పట్టించుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అంటేనే ముస్లిం... ముస్లిం అంటేనే కాంగ్రెస్ అని మరోసారి నిరూపితమైందన్నారు. హిందూ పండుగల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న చులకన భావానికి ఇది నిదర్శనమని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ బోనాల ఉత్సవాలకు నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని గుర్తుచేశారు. ముందుముందు రాబోయే గణేష్ ఉత్సవాలతో పాటు అన్ని హిందూ పండుగలకు రాష్ట్ర ప్రభుత్వం జనాభా నిష్పత్తి ప్రాతిపదికన నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉత్సవాల నిర్వహణలో తమ హక్కులను కాపాడుకోవడానికి, ఆత్మగౌరవాన్ని చాటుకోవడానికి హిందూ సమాజమంతా ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు

# మేం ఏడిస్తే రాష్ట్రానికే మంచిది కాదు..

మొదటి పేజీ తరువాయి...

సమయంలో ఆలయానికి వస్తుండగా.. భక్తుల రద్దీ మధ్య తాము తీవ్ర అసౌకర్యానికి లోనయ్యామని జోగిని శ్యామల అన్నారు. జోగినిలు ఏడిస్తే.. రాష్ట్రానికి మంచిది కాదని, అరిష్టమని పేర్కొన్నారు. బోనాలకు ముందు మమ్మల్ని ప్రభుత్వం మీటింగ్‌కి రావాలని చెబితే వెళ్లామని.. వాళ్లకు సహకరించామని అన్నారు. తీరా చూస్తే సెక్యూరిటీ కల్పించకుండా, పాస్‌లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సమంజసమేనా అని ప్రశ్నించారు. జోగినిల్లో అంతా చదువుకున్నవాళ్లమే ఉన్నామని, తమకు ఆలయ బోర్డులలో ఎందుకు అవకాశం కల్పించరని అన్నారు. రాష్ట్రంలో బోనాల పండుగను రాజకీయ నాయకులు, పోలీసులే చేసుకోండని సెటైర్లు వేశారు. మహంకాళి అమ్మవారి బోనాలు ఇవాళ కాదని.. జోగినులమైన తాము ఎప్పుడు బోనాలు ఎక్కిస్తామో ఆనాడు పండుగని జోగిని శ్యామల సంచలన వ్యాఖ్యలు చేశారు.



# క్షమించరాని తప్పు చేశాను

మొదటి పేజీ తరువాయి...

ప్రోద్బలంతోనే తాను ప్రధానిపై ఆ తరహా అనుచిత వ్యాఖ్యలు చేశానని, తన ప్రవర్తన పట్ల తీవ్రంగా నామూషిగా భావిస్తున్నానని ఆ బాలిక ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే ప్రస్తుతం తన వయసు కేవలం 15 ఏళ్లేనని చెప్పుకొచ్చింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

వైరల్ అవుతున్న వీడియోలో టీషర్టు ధరించిన ఆ బాలిక.. తీవ్ర పశ్చాత్తాపంతో తన పొరపాటును అంగీకరించింది. పోలీసుల ఎఫ్ఐఆర్‌లో నిందితురాలి వయస్సును 25 ఏళ్లుగా పేర్కొన్నప్పటికీ.. ఆ వీడియోలో తాను "కేవలం 15 ఏళ్ల వయసు కల్గిన చిన్న పిల్లను" అని చెప్పడం గమనార్హం."నేను చేసిన పని ఏమాత్రం క్షమించరానిది. ప్రధానిపై చాలా చెడు వ్యాఖ్యలు చేశాను. దేశ ప్రజలందరికీ నమస్కరించి క్షమాపణలు కోరుతున్నాను. నా చర్యల పట్ల నాకు చాలా సిగ్గుగా ఉంది. నన్ను నేనే చూసుకోలేకపోతున్నాను. ఇది నా మొదటి, చివరి తప్పుగా భావించి నన్ను క్షమించండి" అని చేతులు జోడించి విజ్ఞప్తి చేసింది. అయితే ఈ వీడియో చేసింది నిజంగా ఆ బాలికేనా కాదా అనేది ఇంకా ధ్రువీకరణ కాలేదు.

**అసలేం జరిగిందంటే..?**

నీట్ పేపర్ లీకేజీలపై జూలై 23వ తేదీన కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో ఓ యువతి ప్రధానిపై తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. పోలీసులు సదరు యువతిపై కేసు నమోదు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, ప్రజల్లో అశాంతి రేకెత్తించడం, మాననష్టానికి పాల్పడటం వంటి భారతీయ న్యాయ్ సంహితలోని సెక్షన్లు 352, 353(1), 356(1) కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు కోసం ఈ కేసును ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

**క్షమించేద్దామన్న ప్రధాని.. వెంటనే సారీ చెప్పిన బాలిక**

జంతర్ మంతర్ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం రాత్రి సోషల్ మీడియా ద్వారా ఓ వీడియో విడుదల చేశారు. తనపై, తన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యువతను తాను క్షమిస్తున్నానని.. అలాగే ప్రజలు కూడా వారిని క్షమించాలని ఆ వీడియోలో కోరారు. తప్పుగా మాట్లాడినప్పటికీ ఆ పిల్లలంతా మన వాళ్లేనని చెప్పుకొచ్చారు. ఈ వీడియో వైరల్ అయిన కాసేపటికే సదరు బాలిక కూడా వీడియో చేసి పెట్టడం గమనార్హంగా మారింది.

# ముదిరిన కావేరి జల వివాదం

### ఆగస్టు 13న బంద్! ప్రజలకు కర్ణాటక ప్రభుత్వం కీలక విజ్ఞప్తి

కర్ణాటక-తమిళనాడు ఆగస్టు 2 (ప్రభాత ఉదయం)

కావేరి నదీ జలాల పంపకాలపై కర్ణాటక-తమిళనాడు మధ్య మరోసారి వివాదం తీవ్రరూపం దాల్చింది. కావేరి జలాలను విడుదల చేయాలని కోరుతూ తాజాగా తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇదే సమయంలో కావేరి జలాల నిర్వహణ అథారిటీ రోజుకు 3,500 క్యూసెక్కుల చొప్పున 15 రోజుల పాటు నీటిని విడుదల చేయాలని కర్ణాటకను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆదివారం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్రానికి తాగునీరు, ఇతర అవసరాల కోసం సుమారు 40 టీఎంసీల నీరు అవసరమని శివకుమార్ తెలిపారు. అయితే దేశ చట్టాలను గౌరవిస్తూ, తమిళనాడుపై ఉన్న చట్టబద్ధ బాధ్యతలను కూడా కర్ణాటక పాటిస్తుందని స్పష్టం చేశారు.

**ఆగస్టు 13 బంద్‌కు పిలుపు**

ఆగస్టు 13న ప్రతిపాదించిన బంద్‌ను రైతులు, ప్రతిపక్షాలు, కన్నడ సంఘాలు విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బంద్ వల్ల ప్రజలకు, వ్యాపారాలకు, విద్యాసంస్థలకు ఇబ్బందులు తప్ప రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగం ఉండదని అన్నారు. కావేరి జలాల వివాదాన్ని రాజకీయాలకు అతీతంగా చర్చల ద్వారా పరిష్కరించాలన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది.



# ప్రపంచ స్థాయికి తెలంగాణను తీసుకెళ్తున్నాం

మొదటి పేజీ తరువాయి...

వివరించారు.

**3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థే లక్ష్యం.. భారత్ ఫ్యూచర్ సిటీ...**

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లు, రాబోయే ఐదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ప్లాన్‌ను అమలు చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా ఫోర్త్ సిటీగా ముచ్చర్ల ప్రాంతంలో కాలుష్య రహిత నెట్-జీరో ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు.

**యంగ్ ఇండియాతో విద్యా రంగంలో విప్లవం..**

పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని నెలకొల్పామని, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. టాటా గ్రూప్ భాగస్వామ్యంతో రూ.2,100 కోట్లతో ప్రభుత్వ ఐటీఐలను హైటెక్ డిజిటల్ శిక్షణా కేంద్రాలుగా మారుస్తున్నట్లుగా ఆయన వివరించారు. ఇప్పటికే మోడల్‌గా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రారంభించామని,

ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం.. మూసీకి పూర్వవైభవం ..

హైదరాబాద్ మహానగరంలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు హైడ్రావ్యవస్థను తీసుకొచ్చామని, ప్రకృతి వనరులను కాపాడేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. లండన్ థేమ్స్ నది తరహాలో మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ద్వారా మూసీ నదిని శుద్ధి చేసి, పర్యాటక, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని మొదలుపెట్టామని ఆయన వెల్లడించారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 1.20 కోట్ల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని వెల్లడించారు.

**రాష్ట్ర అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలి..**

రీజినల్ రింగ్ రోడ్డు వేగవంతం చేయడం, మెట్రో రైలు రెండో దశ విస్తరణతో పాటు అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా రాబట్టడం వల్ల తెలంగాణ తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలకు చేరిందని భట్టి విక్రమార్క వివరించారు. అమెరికాలోని తెలుగు ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.



# పాకిస్థాన్‌లో విషాదం..

సమీప ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. దాడి వెనుక ఉన్నవారిని గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ అధికారికంగా బాధ్యత స్వీకరించలేదు. ఈ ఘటనను పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు స్పష్టం చేశారు.

# అలా హామీ ఇస్తేనే వచ్చే ఎన్నికల్లో పోటీ

మొదటి పేజీ తరువాయి...

కీలక వ్యాఖ్యలు చేశారు. తన సొంత నియోజకవర్గం నల్లగొండలోని ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన నియోజకవర్గ ఓటర్లకు ఓ కండిషన్ పెట్టారు. వచ్చే ఎన్నికల్లో తనను రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని మాట ఇస్తేనే తాను పోటీలో ఉంటానని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఒకవేళ స్పష్టమైన హామీ రాకుంటే అసలు ఎన్నికల ప్రక్రియ నుంచే తప్పుకుంటానని ప్రకటించి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరతీశారు. స్వయంగా తాను ఎన్నికల ప్రచారానికి రాకపోయినా, ఇప్పటి వరకు నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని చూసి ఓట్లు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ క్రమంలో తన రాజకీయ జీవితం, సొంత ఆస్తుల గురించి కూడా మంత్రి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. సుదీర్ఘకాలం పాటు ఎమ్మెల్యేగా, పలుసార్లు మంత్రిగా ఉన్నపటికీ తనకు సొంత ఇల్లు, భారీగా ఆస్తులు లేవని ఆయన చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో తాను ఇప్పటికీ అద్దె ఇంట్లోనే నివాసం ఉంటున్నానని, తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తుల తప్ప తాను సొంతంగా సంపాదించుకున్నవి లేవని పేర్కొన్నారు. నల్లగొండ అభివృద్దే తన ధ్యేయమని, పదవులు ఉన్నా లేకున్నా ప్రజల కోసమే పనిచేస్తానని వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# బాబుల్ రెడ్డినగర్‌లో ఘనంగా అమ్మవారి ఘటన ఊరేగింపు





**బజంత్రీలతో,పోతురాజుల ఆటలతో భక్తి జోష్..**

**ప్రతి గడపకు అమ్మవారి ఆశీర్వాదాలు చేరాలనే ఉద్దేశంతో కమిటీ ఏర్పాట్లు..**

**రాజేంద్రనగర్,ఆగస్టు02(ప్రభాత ఉదయం)**

ఆషాఢ మాస బోనాల సందర్భంగా కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డినగర్ లో ఉమ్మడి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఘటన ఊరేగింపు కార్యక్రమం రంగా రంగా వైభవంగా జరిగింది.లష్కర్ బోనాలకు వారం ముందు హైదరాబాద్ బోనాల ఆనవాయితీగా ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఊరేగింపులో బజంత్రీల మేళం మోగగా,మల్లేష్ పోతురాజు తలపై అమ్మవారి ఘటాలను ధరించారు.కిష్టప్ప,రమేష్,బీరప్ప తదితర పోతురాజులు ఆటలతో ప్రజలను అలరించారు.వారి నృత్యాలు చూసిన భక్తులు జైబోలో అమ్మ అంటూ నినాదాలు చేశారు.అమ్మవారి ఆశీర్వాదాలు ప్రతి గడపకు చేరాలనే ఉద్దేశంతో ఘటాల ఊరేగింపు బాబుల్ రెడ్డి నగర్ లోని ప్రతి వీధి గుండా కొనసాగింది.ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్,జిహెచ్ఎంసి మాజీ వార్డు మెంబర్ సోమ శ్రీనివాస్ గుప్తా,ఉమ్మడి దేవాలయ కమిటీ అధ్యక్షులు సెంట్రింగ్ శంకర్, మల్లేష్,హనుమంతు,కాటేదాన్ డివిజన్ కార్మిక విభాగం అధ్యక్షులు ఉప్పల్ శ్రీను,భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు వెంకటరమణ గుప్తా,కిషోర్,రవి,అశోక్ కుమార్,సోమ సందీప్,శేఖర్,శ్రీకాంత్,బాలరాజ్,బాలు,శ్రీశైలం,రవి,బొంబాయి రాజ్,కుమార్,సోను తదితరులు పాల్గొన్నారు.ఊరేగింపులో మహిళలు, యువకులు,పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో బోనాల పండుగను జరుపుకున్నారు.

# గగన్ పహాడ్ బస్తీలో ఘనంగా పోచమ్మ, మైసమ్మ బోనాలు







**బజంత్రీలతో,పోతురాజులతో పండుగ వాతావరణం..**

**వర్షాలు,సమృద్ధి కోసం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు..**

**బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి**

**రాజేంద్రనగర్,ఆగస్టు02(ప్రభాత ఉదయం)**

ఆషాఢ మాస సందర్భంగా రాజేంద్రనగర్ పరిధిలోని గగన్ పహాడ్ బస్తీలో పోచమ్మతల్లి,మైసమ్మతల్లి బోనాల వేడుకలు అత్యంత వైభవంగా,కన్నుల పండువగా నిర్వహించారు.ఆదివారం ఉదయం నుంచే బస్తీ అంతా పండుగ శోభను సంతరించుకుంది.బస్తీలోని మహిళలు సంప్రదాయ పట్టుచీరలు,నగలతో అలంకరించుకుని తలపై బోనాలు ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.డప్పు చప్పుళ్లు,బజంత్రీల మేళం మధ్య ఊరేగింపు సాగింది.పోతురాజుల విన్యాసాలు,శివసత్తుల పూనకాలు,యువకుల కేరింతలతో వాతావరణం భక్తిమయమైంది.దారిపొడవునా భక్తులు నీళ్లు,పూలుచల్లి అమ్మవారికి స్వాగతం పలికారు.ఆలయం వద్దకు చేరుకున్న భక్తులు పోచమ్మతల్లి,మైసమ్మతల్లికి బోనాలు,నైవేద్యాలు సమర్పించారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు,కుంకుమార్చనలు నిర్వహించారు.భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని అమ్మవార్ల ఆశీర్వాదం పొందారు.పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ క్యూలైన్ లో నిలబడి దర్శనం చేసుకున్నారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ...ప్రతి ఏటా గ్రామంలో ఈ బోనాల వేడుకలను అత్యంత నిష్ఠతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని,గ్రామస్తులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు చెప్పారు.ప్రభుత్వం బోనాల సందర్భంగా భక్తులకు తాగునీరు,వైద్యం,పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని శీలం తిరుపతిరెడ్డి కోరారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు,యువకులు,పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.సాయంత్రం వరకు భక్తి గీతాలు,డప్పులతో వాతావరణం మారుమోగింది.

# ఉప్పరపల్లిలో ఘనంగా ఆషాఢ మాస బోనాల ఏర్పాట్లు

**సామ భూపాల్ రెడ్డి అధ్యక్షతన గ్రామ ముఖ్య నాయకుల సమావేశం.. ఆగస్టు 9న మాంకాళమ్మ బోనాలు,ఆగస్టు 10న పోచమ్మ బోనాలు**

**రాజేంద్రనగర్,ఆగస్టు02(ప్రభాత ఉదయం)**



అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో లష్కర్ బోనాల అనంతరం ఆనవాయితీగా నిర్వహించే బోనాల మహోత్సవాలను ఈ ఏడాది కూడా వైభవంగా,భక్తిశ్రద్ధలతో,ఐక్యతా భావంతో నిర్వహించేందుకు గ్రామ పెద్దలు సన్నాహాలు ప్రారంభించారు.ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి బోనాల ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశానికి సామ భూపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు.సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని,గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని,ఎలాంటి అంటువ్యాధులు,రోగాలు గ్రామంలోకి రాకుండా పోచమ్మ తల్లి కరుణించాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం బోనాలు సమర్పించడం ఉప్పరపల్లి గ్రామ ఆనవాయితీ అని తెలిపారు.గ్రామ ప్రజలందరూ ఐక్యంగా పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి సంప్రదాయాలను కొనసాగించడం గర్వకారణమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బోనాల ఉత్సవాల తేదీలను ప్రకటించారు.ఆగస్టు 9న మాంకాళమ్మ బోనాలు,ఆగస్టు10న పోచమ్మ బోనాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.గ్రామ ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జయరాం,బొక్క బాల్ రెడ్డి,కృష్ణగౌడ్,మోహన్ రెడ్డి,విట్టల్,పుస్తకాల నర్సింగ్ రావు,నరసింహా రెడ్డి,పుస్తకాల శ్రీనివాస్,శివకుమార్ రెడ్డి,సంజీవ రెడ్డి,రాంరెడ్డి,మల్లారెడ్డి,భూపాల్ రెడ్డి,కిషన్ రావు,కృష్ణగౌడ్(కిట్టు) ,బుచ్చిరెడ్డి,విజయ్ పాల్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,సదానందం,సురేష్ గౌడ్,బొక్క ప్రభాకర్ రెడ్డి,నరసింహారెడ్డి,వెంకట్ రెడ్డి,ప్రసాద్ గౌడ్,కీర్తి ప్రదీప్,జైపాల్ రెడ్డి,పుస్తకాల మహేష్, రాజేష్,మదం రెడ్డితో పాటు ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పలువురు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



# చిట్టీల పేరుతో కుచ్చుటోపీ.. రూ.5 కోట్లతో ఉడాయింపు!

**రాజేంద్రనగర్,ఆగస్టు02(ప్రభాత ఉదయం)**

ఆర్థిక అవసరాలకు అండగా ఉంటుందని చిట్టీలు వేసిన వారిని నిర్వాహకుడు నిలువునా ముంచేశాడు.రూ.5 కోట్లు వసూలు చేసి రాత్రికి రాత్రే ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో సహా వ్యాపారి పరారయ్యాడు.ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ గ్రీన్ సిటీలో జరిగింది.ఐఎంఆర్ మిల్లెట్ రీసెర్చ్ విధులు నిర్వహిస్తూ స్థానికంగా చిట్టీల వ్యాపారం చేస్తూ నమ్మకం కలిగించిన దంపతులు,బాధితుల నుంచి భారీగా డబ్బు వసూలు చేశారు.అధిక లాభాలు వస్తాయని నమ్మించి తమ నుంచి భారీగా డబ్బు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో డబ్బుల విషయమై పలు మార్లు అడిగిన డబ్బులు ఇవ్వకుండ సతాయించాడు.ఈ విషయమై గత 15రోజుల క్రితం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో బాధితులు ఫిర్యాదు చేసారు.ఆ తర్వాత ఎవరికీ చెప్పకుండా శనివారం రాత్రికి రాత్రే ఇంటికి తాళాలు వేసి ఉడాయించారు.చిట్టిల పేరుతో తమను నిండా ముంచాడని బాధితులు ఆదివారం అశోక్ ఇంటి ముందు ధర్నాకు దిగారు.రోజువారీ కూలీలు, ఉద్యోగులు,మహిళలు,వృద్ధులు..ఇలా ఎంతో మంది తమ కష్టార్జిత సొమ్మును చిట్టీల్లో పెట్టుబడిగా పెట్టారు.కొందరు తమ పింఛన్ డబ్బును కూడా అశోక్ వద్ద చిట్టీల్లో జమ చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అశోక్ వద్ద నుండి తమ డబ్బులు ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.



# గగన్‌పహాడ్ బోనాల వేడుకల్లో పాల్గొన్న స్థానిక నాయకులు

**భక్తిశ్రద్ధల మధ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు..**

**రాజేంద్రనగర్,ఆగస్టు02(ప్రభాత ఉదయం)**

ఆషాఢ మాస బోనాల సందర్భంగా గగన్‌పహాడ్‌లో నిర్వహించిన అమ్మవారి బోనాల వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి.పోతురాజుల విన్యాసాలు,డప్పు వాయిద్యాలు,భక్తుల జైజైధ్వానాల నడుమ మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖశాంతులతో జీవించాలని,రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్రోళ్ల యాదయ్య,దుర్గేష్, శ్రీశైలం,సద్గుణాచారి, శ్రీరాములు, శ్రీనివాస్,సదానంద్‌తో పాటు స్థానిక నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మైలర్‌దేవ్‌పల్లిలో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా బోనాల వేడుకలు

**పలు అమ్మవార్ల ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,ఆగస్టు02(ప్రభాత ఉదయం)**

తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఆషాఢ మాస బోనాల సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలర్ దేవ్‌పల్లి ప్రాంతం భక్తి పారవశ్యంతో కళకళలాడింది.బోనాల వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మైలర్ దేవ్‌పల్లి పరిధిలోని పలు అమ్మవార్ల ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖశాంతులతో జీవించాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని,ప్రతి కుటుంబంలో సిరిసంపదలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.బోనాల సందర్భంగా ఆలయాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.డప్పు వాయిద్యాలు,పోతురాజుల విన్యాసాలు,భక్తుల జైజైధ్వానాల మధ్య ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.



# భావితరాలకు స్ఫూర్తిదాయకం బాదిని చెన్నయ్య పోరాటం





### పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం తపించిన మహనీయుడు చెన్నయ్య :

### సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే. రాజయ్య

### డిజైర్ సొసైటీ అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం

**పటాన్ చెరు, ఆగస్టు 2 (ప్రభాత ఉదయం) :**

బావి తరాలకు ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ చైర్మన్ భాదిని చెన్నయ్య పోరాటం స్ఫూర్తిదాయకమని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య అభిప్రాయపడ్డారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దివంగత భాదిని చెన్నయ్య 5వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన అభిమానులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బొల్లారం డివిజన్ పరిధిలోని 'డిజైర్ సొసైటీ' అనాథ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సిఐటియు (రాష్ట్ర కమిటీ సభ్యులు కే. రాజయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కే. రాజయ్య మాట్లాడుతూ బాదిని చెన్నయ్య ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చి, తన కృషి పట్టుదలతో అంచలంచెలుగా ఎదిగి ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గా ప్రజలకు విశేష సేవలందించారని కొనియాడారు. సీపీఐ(ఎం) పార్టీలో వివిధ స్థాయిల్లో పనిచేస్తూ, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడని ఆయన స్మరించుకున్నారు. పేదరికం ఎంతలా వెంటాడిన దృఢ సంకల్పంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా జడ్పీ చైర్మన్‌గా ఎదిగారన్నారు. వ్యవసాయ కూలీగా,పోరాట యోధుడిగా, రాజకీయ నేతగా.. ప్రజాప్రతినిధిగా,పేదోడి కంచంలో మెతుకులా,ఉన్నోడి అహంకారానికి ధిక్కార స్వరంలా ప్రజాసమస్యలపై పోరాడి నిలిచిన మార్గదర్శకుడు బాదిని చెన్నయ్య అని గుర్తు చేసుకున్నారు. నోముల గ్రామంలోని నాటి అసమానతలను ఎవ్వరికీ నొప్పి కలిగించకుండా తన రాజకీయ చతురతతో పరిష్కరించిన తీరు అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా భాదిని చెన్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాదిని శ్రీను, సత్యం, రాజ్‌కుమార్, శ్రీనివాస్, కృష్ణ గౌడ్, ప్రదీప్ రెడ్డి, అనిల్ తో పాటు డిజైర్ సొసైటీ నిర్వాహకులు, సిబ్బంది, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మ వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి

### ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

### భానూరు ధన మైసమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, ఆగస్టు 2 (ప్రభాత ఉదయం) :**

పటాన్ చెరు మండలం భానురు గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ ధనమైసమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అమ్మ వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోపాల్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి చిహ్నం

### నీలం మధు ముదిరాజ్..

### మహేశ్వరంలో ఘనంగా బోనాల పండుగ.. పాల్గొన్న మధు

**పటాన్ చెరు, ఆగస్టు 2 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉంది అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఆషాడ మాస బోనాల పండుగ సందర్భంగా ఆయన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరంలోని శ్రీశ్రీశ్రీ మహంకాళి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం పలికి సత్కరించారు, ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆ అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు, ఈ కార్యక్రమంలో స్థానికులు మహేందర్, ఈశ్వర్, మల్లేష్, హరికృష్ణ, ఎట్టయ్యా, జంగయ్య, యాదయ్య, కుమార్, పరమేశ్, నరేష్, శ్రీను, కావలి జంగయ్య, మహేష్, శివరామకృష్ణ, జాతర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.




నూతన దంత వైద్య ఆసుపత్రిని ప్రారంభించిన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల జయలక్ష్మి

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరిగే జైల్ బరోను జయప్రదం చేద్దాం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2(ప్రభాత ఉదయం)**

నాడు క్విట్ ఇండియా నినాదంతో సామ్రాజ్యవాదుల నుండి దేశాన్ని ఏ విధంగా రక్షించుకున్నామో,నేడు స్వదేశీ గుత్తా పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మిక వర్గ ఐక్యతతో దేశాన్ని రక్షించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఉప్పేర్ నరసింహ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఆదివారం గద్వాలలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులకు, మతోన్మాదులకు వ్యతిరేకంగా నేడు కార్మికులు, రైతులు,వ్యవసాయ కూలీలు, ప్రజలు, ప్రజాతంత్ర వాదులు ఐక్యంగా నిలబడి పోరాడాలన్నారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన స్వాతంత్రోద్యమ వీరుల స్ఫూర్తితో నేడు దేశంలో బిజెపి తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు పదిన జరిగే జైల్ భరో కార్యక్రమానికి కార్మిక వర్గం అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల కార్మిక,రైతు,ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించే ఈ జైల్ బరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు,వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో హమాలీ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తిరుపతన్న,లక్ష్మన్న, కార్మికులు రామకృష్ణ,బాలకృష్ణ, నరసింహ ,మజ్జిగ ఆంజనేయులు రంగన్న,వీరేష్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## ఉజ్జాయని మహంకాళి బోనాల పండుగ ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న జిల్లా గణేష్ నేత

**కూకట్ పల్లి, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఉమ్మడి అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో ఉజ్జాయని మహంకాళి అమ్మవారి బోనాల సందర్బంగా ఆశనగర్ దాతి రమేష్ ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఉజ్జాయని మహంకాళి అమ్మవారి బోనాలజాతర సందర్బంగా అమ్మవారిని అంగరంగ వైభవంగ అలంకరించి భక్తులకు ఆశీర్వచనం అందిస్తుందని ప్రతి సంవత్సరం శంశిగుడా పరిధిలో అమ్మవారి ఆషాఢమాస మూడవ ఆదివారం నిర్వహించడం జరుతుందని ఇందులో భాగంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశిశులు తీసుకొని అమ్మవారి మొక్కులు చెల్లించుకోవడం జరుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, రమేష్, సంగారెడ్డి, ఆనంద్, శ్రీనివాస్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## కేరళలో భారీ వర్షాలు.. 8 మంది మృతి

### 13 మందికి గాయాలు.. సీఎం సతీష్ కీలక సూచనలు

**(ప్రభాత ఉదయం)**

కేరళను భారీ వర్షాలు ముంచెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా 8 మంది మరణించగా, 13 మంది గాయపడ్డారు. మరో ఎనిమిది మంది గల్లంతయ్యారు. వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అనేక చోట్ల భారీ ఆస్తి నష్టం సంభవించింది. రహదారులు దెబ్బతిన్నాయి. అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. అనేక ఇండ్లు ధ్వంసం కాగా.. ఐదు వేల మంది ప్రజల్ని లోతట్టు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం వర్షాలు కాస్త తగ్గుముఖం పడుతున్నట్లు కనిపించినా.. ఇంకా పూర్తిస్థాయిలో పరిస్థితులు అదుపులోకి రాలేదు. మళ్లీ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేరళ సీఎం వీడీ సతీషన్ ప్రజలకు, అధికారులకు సూచించారు. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. అలాగే, అత్యవసర మెడిసిన్ సిద్ధంగా ఉంచాలని సూచిచారు. పర్వత ప్రాంతాల్లో నివసించేవారు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు పూర్తి అప్రమత్తతతో ఉండాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో తాజా వర్షాల కారణంగా 27 ఇండ్లు పూర్తిగా దెబ్బతినగా, 196 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.



## మూసాపేట అంగరంగ వైభవంగా బోనాల మహోత్సవం


### పాల్గొన్న టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్ పల్లి, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం)**

ఆషాఢ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేటలో మైసమ్మ తల్లి దేవాలయం, శ్రీ ఉప్పలమ్మ తల్లి దేవాలయం, శ్రీ బీరప్ప స్వామి ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి రమేష్ రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, రఘు, సంతోష్, వినయ్, రజనీకాంత్, ఎల్లారావు, సర్పంచ్ శ్రీను, రాజు, విజయలక్ష్మి, బాలరాజు, వాసు తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి





### గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు2(ప్రభాత ఉదయం)**

వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కోరారు. ఆదివారంగద్వాలలో భీంనగర్ లో ఏర్పాటు చేసిన గద్వాల్ డెంటల్ క్లీనిక్ ను గద్వాల బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి ఆడంబరంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ --- నేటి ఆధునిక జీవనశైలి, ఆహార అలవాట్ల వల్ల దంత సమస్యలు పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ నోటి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు మెరుగైన దంత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. అత్యాధునిక పరికరాలతో, అనుభవజ్ఞులైన వైద్యులచే తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వేదావతి వెంకటేశ్వర్ రెడ్డి, రామలింగేశ్వర కాంప్లే, చంద్రశేఖర్, డాక్టర్ శోభారాణి, డెంటల్ డాక్టర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ యేడు తిరుమలలో రెండు బ్రహ్మోత్సవాలు

## సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో వరుసగా నిర్వహణ



**తిరుమల, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం)**

తిరుమలలో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో పరవశింప చేయనున్నాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించ నున్నారు. సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయి. ఈ మేరకు టిటిడి భారీగా ఏర్పాట్లు చేస్తోంది. సెప్టెంబర్ 15న సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహనం ఉ ంటుంది. 16న ఉదయం 8 గంటలకు చిన్న శేష వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు హంస వాహనం ఉంటుంది. 17న ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి వాహనం నిర్వహిస్తారు. 18న ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనం, రాత్రి 7 గంటలకు సర్వ భూపాల వాహనం, 19న ఉదయం 8 గంటలకు మోహినీ అవతారం, సాయంత్రం 6:30 నుంచి రాత్రి 11:30 గంటల వరకు గరుడ వాహనం నిర్వహిస్తారు. 20న ఉదయం 8 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 4 గంటలకు స్వర్ణ రథం, రాత్రి 7 గంటలకు గజ వాహనం నిర్వహిస్తారు. 21న ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనం, 22న ఉదయం 7 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం, 23న ఉదయం 6 నుంచి 9 వరకు చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో సిఫారసు లేఖలను అనుమతించరు.

# సినారె సాహిత్య స్ఫూర్తికి ఘన నివాళి

## నామాల రవీంద్రసూరికి సినారె సాహిత్య పురస్కారం--2026

**కూకట్ పల్లి, ఆగస్టు 2(ప్రభాత ఉదయం)**



పద్మభూషణ్, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత మహాకవి డా. సి. నారాయణరెడ్డి 95వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన సినారె సాహిత్య పురస్కారం--2026 వేడుకలు సాహిత్య వైభవాన్ని ప్రతిబింబించాయి. ప్రముఖ కవులు, రచయితలు, కళాకారులు, సినీ ప్రముఖులు, సాహిత్యాభిమానుల తో కళకళలాడిన ఈ సభలో సినారె సాహిత్య వారసత్వాన్ని ఘనంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా. నందిని సిధారెడ్డి అధ్యక్షత వహించగా, ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినారెతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, తెలుగు సాహిత్యానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. భావుకత, భాషా సౌందర్యం, మానవీయ విలువల సమ్మేళనంగా సినారె రచనలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది ప్రతిభావంతులైన కవులకు "సినారె సాహిత్య పురస్కారం--2026" ప్రదానం చేశారు. వారిలో కవి, రచయిత, సినీ దర్శకుడు నామాల రవీంద్రసూరి పురస్కారం అందుకోవడం విశేషంగా నిలిచింది. పురస్కారం స్వీకరించిన అనంతరం నామాల రవీంద్రసూరి మాట్లాడుతూ సినారెతో తనకు ఏర్పడిన సాహిత్య అనుబంధం జీవితాంతం మరువలేనిదని పేర్కొన్నారు. ఆయన సాహిత్య ఆలోచనలు, ప్రోత్సాహం తన రచనా ప్రయాణానికి బలమైన పునాదిగా నిలిచాయని అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో సమాజానికి ఉ పయోగపడే విలువైన సాహిత్యాన్ని అందించేందుకు మరింత అంకితభావంతో కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన సమన్వయకర్త పోరెడ్డి రంగయ్య, కార్యక్రమ నిర్వాహకులు రాములు, జ్యూరీ సభ్యులు, నిర్వాహక కమిటీతో పాటు తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సినారె సాహిత్య స్ఫూర్తిని నేటి తరానికి చేరవేసే లక్ష్యంతో నిర్వహించిన ఈ సభ ఆద్యంతం సాహిత్యాభిమానులను అలరించింది. ప్రముఖుల ప్రసంగాలు, సినారె సాహిత్య విశిష్టతపై జరిగిన చర్చలు, పురస్కార ప్రదానోత్సవం కార్యక్రమానికి మరింత గౌరవాన్ని తీసుకువచ్చాయి. సాహిత్యానికి అంకితమైన మహాకవి సినారె జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలబెట్టే వేదికగా ఈ కార్యక్రమం నిలిచిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# 18 ఏళ్ల శ్రమకు ఇదేనా ప్రతిఫలం?

## ఎంటిఎఆర్ యాజమాన్యంపై కార్మికుల ఆగ్రహం

**కంపెనీ అభివృద్ధికి మేమే బలమైన పునాది మేమె**

**మా హక్కుల సాధన కోసమే ఈ పోరాటం అంటూ కార్మికుల స్పష్టీకరణ**

**కూకట్ పల్లి, అగస్ట్ 2 (ప్రభాత ఉదయం)**




కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలోని ఎం టి ఎ ఆర్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఇ ఓ యు పరిశ్రమలో పనిచేస్తున్న ఫిక్స్డ్ టర్మ్ కార్మికుల ఆందోళన నాలుగో రోజుకు చేరుకుంది. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ స్టేట్ ఫిక్స్డ్ టర్మ్ అండ్ నాన్ రెగ్యులర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశ్రమలో కొందరు కార్మికులు 18 సంవత్సరాలుగా నిరంతరం పనిచేస్తున్నప్పటికీ ఫిక్స్డ్ టర్మ్ పేరుతో వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించకుండా యాజమాన్యం శ్రమ దోపిడీకి పాల్పడుతోందని అన్నారు. పదేళ్లకు పైగా సేవలందించిన కార్మికులను కూడా పర్మినెంట్ చేయకుండా పని భారం పెంచుతూ, వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. బోనస్ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన బోనస్‌ను కూడా చెల్లించకుండా కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని, పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా ఉత్పత్తిలో పనిచేస్తున్న ఫిక్స్డ్ టర్మ్ కార్మికులకు "సమాన పనికి సమాన వేతనం" ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. అదనపు పని చేయించుకుని చట్టప్రకారం డబుల్ వేతనం ఇవ్వాల్సిన చోట సింగిల్ వేతనం మాత్రమే చెల్లిస్తూ, పని ప్రదేశాల్లో వేధింపులు, ఒత్తిళ్లు పెంచుతున్నారని తెలిపారు. అయితే, తాము కంపెనీకి వ్యతిరేకులు కాదని, ఉత్పత్తికి (ప్రొడక్షన్‌కు) కూడా ఎలాంటి ఆటంకం కలిగించాలని కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఎం టి ఎ ఆర్ పరిశ్రమ మరింత అభివృద్ధి చెందాలని కార్మికులందరూ కోరుకుంటున్నారని, ఆ అభివృద్ధికి తమ చెమట, శ్రమ, అంకితభావంతో ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్న కార్మికులకు న్యాయం జరగాలన్నదే తమ పోరాటం ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ ఆందోళన కంపెనీకి వ్యతిరేకంగా కాదు... కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసమే అని స్పష్టం చేశారు. ఈరోజు పరిశ్రమ ఈ స్థాయికి ఎదగడానికి కార్మికుల కష్టం, నైపుణ్యం, త్యాగమే ప్రధాన కారణమని, అలాంటి కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. గత నాలుగు రోజులుగా కార్మికులు శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయడం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం, చట్టబద్ధమైన బోనస్ చెల్లించడం, అదనపు పనికి డబుల్ వేతనం ఇవ్వడం, పని ప్రదేశాల్లో వేధింపులకు ముగింపు పలకడం వంటి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో కార్మిక సంఘాలతో కలిసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అశోక్, కీలుకాని లక్ష్మణ్, సహాయ కార్యదర్శి రాజశేఖర్, లింగస్వామి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఉ మామహేష్, స్వామి, హరినాథ్, కార్మిక నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మోసిస్, సింహాచలం, పరమేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొని కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.

## ఎంటెక్ డేటా సైన్స్‌లో మొదటి ర్యాంక్ సాధించిన అగ్ని మండల రాజేశ్వరి

**శుభాకాంక్షలు తెలిపిన**

**కాంగ్రెస్ నాయకులు మందలపు సాయిబాబా చౌదరి**

**కూకట్ పల్లి, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం)**



కూకట్‌పల్లి నియోజకవర్గం, కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్ డివిజన్‌కు చెందిన అగ్నిమండల రాజరాజేశ్వరి గీతం హైదరాబాద్‌లో ఎం.టెక్ డేటా సైన్స్ విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సాధించి విశిష్ట ప్రతిభ కనబరిచారు. ఈ ఘనవిజయం సాధించిన సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాయిబాబా చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధిస్తే సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని, కుమారి అగ్నిమండల రాజరాజేశ్వరి సాధించిన ఈ విజయం వసంతనగర్ డివిజన్‌కే కాకుండా కూకట్‌పల్లి నియోజకవర్గానికే ఆదర్శమని పేర్కొన్నారు. గీతం యూనివర్సిటీ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రతిభను గుర్తించి, విశాఖపట్నం లోక్‌సభ సభ్యులు, గీతం యూనివర్సిటీ ప్రెసిడెంట్ మతుకుమిల్లి భరత్ చేతుల మీదుగా, అలాగే ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి చేతుల మీదుగా గోల్డ్ మెడల్, మెమెంటో, ప్రతిభా సర్టిఫికెట్ అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న వసంతనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి మరోసారి ఆమెను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే అగ్నిమండల రాజరాజేశ్వరి తల్లి అగ్నిమండల విజయలక్ష్మి ని కూడా ప్రత్యేకంగా అభినందించారు. స్వయంకృషితో తన ఇద్దరు పిల్లలను ఉ న్నత స్థాయికి తీర్చిదిద్దుతూ, సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న విజయలక్ష్మి సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు.




# ఉత్తరాంధ్రకు మణిహారం భోగాపురం !

**భోగాపురం, ఆగస్ట్ 2 (ప్రభాత ఉదయం)**

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, సువిశాల సముద్రతీరం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కలసి వచ్చే అంశం. రోడ్లు గ్రామాలను అనుసంధానిస్తే, రైల్వేలు పరిశ్రమలను కలుపుతాయి. ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకాశాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమీలో అంతర్జాతీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామిక ఎగుమతులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయి. దీంతో అభివృద్ధి వేగంగా సాగడానికి దోహదపడుతుంది. ఎపిలో అనేక సహజ వనరులు ఉన్నప్పటికీ గతంలో నిర్లక్ష్యం చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ఓ వైపు భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చింది. ప్రధాని మోడీ దీనిని ప్రారంభించడం ద్వారా ఉత్తరాంధ్ర కు గేట్‌వేను తెరిచారు. అమరావతలి రాజధాని నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. అలాగే పోలవరం పూర్తి కావస్తోంది. ఇవన్నీ నిజానికి జగన్ హచయాంలోనే పూర్తి కావాల్సిన ప్రాజక్టులు. కానీ జగన్ నిర్లక్ష్యం కారణంగా వీటిని పక్కన పెట్టారు. మనమెంతకాలం ఉంటామన్నది పక్కన పెట్టి అభివృద్ధిలో మనదైన ముద్ర వేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారు. దశాబ్దాలుగా విశాఖపట్నం ఉత్తరాంధ్రకు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్నా, ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం కాదు. ఇది నావల్ డాక్ వారి విమానాశ్రయం కావడంతో చంద్రబాబు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయా నికి నిర్ణయించారు. విశాఖ పట్టణానికి ఇది దగ్గరగా ఉ ండడ, ఉత్తరాంధ్రకు కూడా కలసి వచ్చే అంశం. విశ్శాఖ పూర్తిస్తాయి విమానాశ్రయం కాకపోవడంతో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు విశాఖకు తగినన్ని సర్వీసులు నడపలేక పోయాయి. విశాఖపట్నం ఐటీ, ఫార్మా, వైద్యం, విద్య పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా ఎదుగుతున్న వేళ, ఒక పూర్తిస్థాయి పౌర అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఏర్పడింది. అందుకే ఎపి విభజన తరవాత చంద్రబాబు భోగాపురం కోసం నిర్ణయించారు. 2014లో విశాఖ సమీపంలోని భోగాపురాన్ని గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కేవలం విమానాశ్రయమే కాకుండా ఏరోసిటీ, విమానాల మరమ్మతులు, పైలట్ శిక్షణ కేంద్రాలతో కూడిన లాజిస్టిక్స్ హబ్‌గా దీనిని డిజైన్ చేశారు. భూసేకరణ చేపట్టి, ఇళు్లు కోల్పోయిన 390 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక కాలనీలు నిర్మించారు. అన్నింటికి మించి రామ్మోహన్ నాయుడును ఎన్‌డిఎలో పౌర విమానయాన శాఖ మంత్రిగా నియించయుకోవడం ద్వారా పనులు చకచకా చేయించుకోగలిగారు. చంద్రబాబు సిఎంగా కొనసాగివుంటే 2019లోనే ఇది పూర్తయ్యేది. దాదాపు 12 ఏళ్ల తరవాత మళ్లీ రెండోదఫా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక భోగాపురం వేగం పుంజుకుని చకచకా పనులు పూర్తి చేసుంది. ఇలా చరిత్రలో 2026 ఆగస్టు 1 నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం విశేషం. సాధారణంగా విమానాశ్రయాలు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. కానీ కొన్ని ప్రాజెక్టులు మాత్రమే ఒక ప్రాంత ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సరిగ్గా అటువంటి ప్రాజెక్టే! మౌలిక సదుపాయాల కల్పన ఏ ప్రాంత ఆర్థికాభివృద్ధికైనా పునాది వంటిది.